మంచిర్యాలలో వందేభారత్ హాల్టింగ్ లేనట్లేనా..!

మంచిర్యాల, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇవ్వడంపై స్పష్టత లేకుండా పోయింది. సౌత్ సెంట్రల్ రైల్వే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి కొన్ని రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మక స్టాపేజీ వివరాలను ఇటీవల విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి ఇవి ప్రారంభమవుతాయని పేర్కొంది. రైలు నంబర్ 12522 ఎర్నాకులం- బరౌని రప్తీ సాగర్ ఎక్స్‌పెక్స్ రైలుకు చీరాలా రైల్వే స్టేషన్‌లో, రైలు నెంబర్ 16004 నాగర్‌సోల్- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌పెక్స్ రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషనలో, రైలు నంబర్ 12656 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ -అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మక స్టాపేజీలు ఇచ్చింది. ఈ క్రమంలో మంచిర్యాలలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైల్‌కు స్టాపేజీ ఇవ్వాలనే అంశాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు లేదు. దాదాపు 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి కొత్త స్టేషన్‌లలో హాల్టింగ్ ఇస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. కానీ ఈ జాబితాలో వందేభారత్ ఎక్స్‌పెక్స్, మంచిర్యాల ప్రస్తావనే లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వందేభారత్ రైలును మంచిర్యాలలో ఆపాలంటూ ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ సహా జిల్లా బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ సైతం వినతిపత్రాలు సమర్పించారు. రైల్వే శాఖ కేంద్ర మంత్రిని, సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులను కలిసి చర్చించినట్లు, వినతులు ఇచ్చినట్లు ప్రచారం చేసుకున్నారు. మరి ఆ వినతులన్నీ ఏమయ్యాయి.. అసలు మంచిర్యాల జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేసిన విజ్ఞప్తులను కేంద్ర మంత్రులు, రైల్వే ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారా.. లేదా..! అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ ఇవ్వాలనే డిమాండ్లు ఎప్పటి నుంచో ఉన్నాయి. కేరళ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ ఆపాలంటూ ఎప్పటి నుంచి జిల్లా వాసులు కోరుకుంటున్నారు. కానీ సౌత్ సెంట్రల్ రైల్వే విడుదల చేసిన జాబితాలో కేరళ ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన ప్రస్తావన సైతం లేకపోవడం, వందేభారత్ ఊసే ఎత్తకపోవడంతో జిల్లా వాసులు నివాశకు గురవుతున్నారు.

బీఆర్ఎస్ నేతకు నివాళి

కన్నీటి పర్యంతమైన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బుగ్గరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, స్థానిక నాయకులు

కాసిపేట, ఫిబ్రవరి 5 : కాసిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నేత అక్కెపల్లి బుగ్గరాజు ఇటీవల మృతి చెందగా, బుధవారం సంతాప సభ నిర్వహించారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై, బుగ్గరాజు మృతిపై కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన భార్య, మాజీ ఎంపీటీసీ అక్కెపల్లి లక్ష్మీ.. చిన్నయ్యను చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. ప్రజలకు బుగ్గరాజు చేసి సేవలు మరువలేనివని దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. వారి కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, నాయకులు అగ్గి సత్తయ్య, రాంటెంకి వాసుదేవ్, మోటూరి వేణు, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, లంక లక్ష్మణ్, శేఖర్, చుక్క సదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను అభివృద్ధి పథంలోకి తేవాలి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలోని 5 జిల్లాలు 8 మండలాల్లో అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, అభివృద్ధి పథంలోకి తేవాలని సెర్ప్ సీఈవో దివ్య పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం అనే అంశంపై కుమ్రం భీం ఆసిఫాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని, అత్యంత వెనుకబడిన నిరుపేదలను అభివృద్ధిలోకి తీసుకురావాలని, సుస్థిర జీవన ప్రమాణాలను పెంపొందించాలన్నారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్డీవో దత్తారాం, అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాలోని ఆదివాసుల సుస్థిర జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను అధికారుల సమన్వయంతో అమలు చేస్తున్నటటుల తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం

వాంకిడి, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలో మాలలకు సీఎం తీరని అన్యాయం చేశారని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం, సిద్ధార్థ యువజన సంఘాలు తీవ్రంగా ఆక్షేపించాయి. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం బైఠాయించి, నిరసన చేపట్టారు. బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కార్, అంబేద్కర్ సంఘం మండల, ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, సమాజ అధ్యక్షుడు మహాత్మా రాజేంద్ర ప్రసాద్, బౌద్ధ పాసక్ పాండుజీ జాడే, అంబేద్కర్ సంఘం నాయకులు దుర్గం పెంటూ, రోషన్ ఉప్రే, అరుణ్ మహల్కార్, రాంటెంకే ప్రతాప్, రమేశ్, మనోజ్ దుర్గం, దీపక్, కార్తిక్, నాగ్సేన్, దీపు రత్న, నూతన్, జయపాల్, దుర్గం చింటూ, బావంత్, రాజేశ్వర్, రాకేశ్, రాందాస్, భీమ్ రావ్, చంద్రమని, దుర్గం పొంచాలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 6 : బీజేపీ ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అదానీకి వేల కోట్లు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, కార్మికులను ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యమంలో ఖలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, రాయమల్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

తాండూర్, ఫిబ్రవరి 5 : గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీవో అనిల్ కుమార్ గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయితిని బుధవారం మిషన్ భగీరథ ఏఈ మనోహర్ తో కలిసి ఎంపీవో సందర్శించడం జరిగింది. గ్రామంలోని ఓహెచ్ఆర్ ట్యాంకులు, హ్యాండ్ పంపులను పరిశీలించారు. అలాగే మిషన్ భగీరథ వాటర్ రిజిస్టర్ లను, గ్రామ పంచాయతీ అన్ని రికార్డ్స్ ని పరిశీలించి అప్డేట్ చేసుకోవాలని కార్యదర్శి కార్తీక్‌రాజు కు సూచించారు. రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేయించాలని, గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ చెత్త కనబడకుండా చూసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

- మున్సిపల్ ప్రాంతీయ సంచాలకుడు షాహీద్ మసూద్
- మందమర్రి మున్సిపాలిటీలో ఆకస్మిక పర్యటన

మందమర్రి కమిషనర్‌కు సూచనలిస్తున్న ప్రాంతీయ సంచాలకుడు షాహీద్ మసూద్

మందమర్రి, ఫిబ్రవరి 5 : మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పురపాలక పరిపాలన శాఖ వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు షాహీద్ మసూద్ అన్నారు. ప్రజారోగ్య శాఖ వరంగల్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఆదిలాబాద్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్‌తో కలసి మందమర్రి మున్సిపాలిటీలో బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. మున్సిపాలిటీ పరిధిలోని చతులాపూర్ సమీపంలో గల డంప్‌యార్డ్‌ను సందర్శించారు. డంప్‌యార్డ్‌లోని బయోమైనింగ్ సైట్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మొక్క నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు డంప్ యార్డ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. వార్డుల్లో సేకరిస్తున్న చెత్తను యార్డుకు తరలించి, తడిపొడి చెత్త వేరు చేయాలని, ఉపయోగకరమైన చెత్తను కంపోస్ట్ షెడ్డుకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తుంగపిండి రాజలింగు, డీఈ సుమతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీ శ్యాంసుందర్, సీనియర్ అసిస్టెంట్ బండారి శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఎం గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్ బాక్స్ అందిస్తున్న సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్

బాలికల సంరక్షణకు చర్యలు

వాంకిడి, ఫిబ్రవరి 5 : జిల్లాలో బాలికల సంరక్షణ కోసం పటిష్ట రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, హక్కులు, హెల్ప్‌లైన్లపై అవగాహన కల్పిస్తున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పథకం కింద వాంకిడి కేజీబీవీ ఎంపికైన సందర్భంగా (జీసీఈసీ) గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లో భాగంగా చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098, గ్రీవెన్స్ బాక్స్ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా మిషన్ సమన్వయకర్త శారద, జెండర్ స్పెషలిస్ట్ రాణి, పాఠశాల ప్రత్యేకాధికారి మీనాతో కలిసి ఆయన హాజరయ్యారు. విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగా, వ్యాయామం తప్పనిసరిగా చేయాలని తెలిపారు. గ్రీవెన్స్ బాక్స్‌లో విద్యార్థులు వారి సమస్యలను తెలిపితే ప్రతీ సోమవారం గర్ల్ ఫ్రెండ్లీ టీచర్ ద్వారా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు

వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో సుశాంత్ బోబడే

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5 : అనుమానిత వన్యప్రాణుల వేటాగాళ్ల వద్ద లభించిన వెంట్రుకలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించినట్లు, రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ బోబడే స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అనుమానిత వేటాగాళ్లను 3వ తేదీన రైల్వే స్టేషన్‌లో అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్నా ఆయుధాలను పరిశీలించి, వాటిలో లభించిన వెంట్రుకలను పరీక్ష నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్ హైదరాబాద్‌కు పంపినట్లు చెప్పారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల గడ్చిరోలిలో వేటగాళ్ల మూటా పట్టుబడిందని వారితో ఏమైనా సంబంధాలు ఉన్నాయా.. అనే కోణంలో విచారణ కొనసాగుతుందన్నారు. నిందితులు మాత్రం ప్లాస్టిక్ పూలు మాత్రమే విక్రయిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఇంటెలిజెన్స్ సమాచారంతోనే వారిని అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుసీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వదినవాహన్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శిశధర్‌బాబు, సిబ్బంది రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేస్తున్న క్వార్టర్లను పరిశీలించిన సెక్యూరిటీ అధికారులు

సింగరేణి క్వార్టర్ల కబ్జా

- యథేచ్ఛగా మరమ్మతులు.. ఆలస్యంగా వెలుగులోకి
- నిర్ధారించిన అధికారులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 5 : రామకృష్ణాపూర్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న సింగరేణి రెండు క్వార్టర్స్‌ను కుల సంఘం పేరుతో కొందరు నాయకులు గుట్టు చప్పుడు కాకుండా ఆక్రమించుకొని, యథేచ్ఛగా మరమ్మతులు చేపట్టిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మందమర్రి ఏరియా సింగరేణి సెక్యూరిటీ అధికారుల పరిశీలనతో బయటకు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌ను ఆనుకొని ఉన్న సింగరేణి స్పెషల్ 'సి' క్లాస్ క్వార్టర్లు 35,36ను కొందరు నాయకులు ఆక్రమించి, కిటికీలు బిగించడం, దర్వాజలు మార్చడం, స్లాబ్ పనులు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సింగరేణి ఎస్టేట్, సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది క్వార్టర్ల వద్దకు చేరుకొని పరిశీలించారు. క్వార్టర్లు కబ్జా చేసి, మరమ్మతులు చేపడుతున్నారని నిర్ధారించారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌలి, విజిలెన్స్ గార్డు శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతానికి ఇటుకలు, ఇసుక, సిమెంట్ తీసుకెళ్లాలని ఆదేశించామని పేర్కొన్నారు. లేకపోతే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఉన్నతాధికారులు అందుబాటులోకి రాలేదు. సంబంధిత కుల సంఘం నాయకులను ఫోన్‌లో సంప్రదించగా.. గతంలో కుల సంఘం భవనానికి శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు.

బెల్లంపల్లిలో ప్రభుత్వ స్థలం కబ్జా

ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 : బెల్లంపల్లిలోని ప్రభుత్వ భూముల కబ్జాల పరంపర జోరుగా సాగుతున్నది. ఖాళీ జాగా కనిపిస్తే అక్రమార్కులు తాత్కాలిక నిర్మాణాలు చేపడుతూ, తర్వాత భవనాలు నిర్మించడం నిత్య కృత్యంగా మారింది. సంబంధిత అధికారులు ఉక్కుపాదం మోపుతున్నా అడ్డుకట్టవేయలేకపోతున్నారు. తాజాగా కన్నాల జాతీయ రహదారి పక్కన 112 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, నిర్మాణం చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో అదే స్థలంలో నిర్మాణం చేపట్టినా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అదే స్థలంలో ప్రస్తుతం ప్రహరీతో మధ్యలో చిన్న గదిని ఏర్పాటు చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుడే ఈ కబ్జాకు తెరలేపాడనే ప్రచారం జరుగుతున్నది. నకిలీ పట్టాలు సృష్టించడమే కాకుండా కోర్టు ఆర్డర్ ఉందంటూ ప్రచారం చేసుకుంటున్నాడని తెలుస్తున్నది. ఫేక్ పొజిషన్‌తో కోర్డు ఆర్డర్ ఒకచోట, కబ్జా మరోచోట చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ జ్యోత్స్నను వివరణ కోరగా, కబ్జా జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణ జరుపుతున్నామని, సదరు వ్యక్తి చూపిస్తున్న కోర్టు ఆర్డర్ చూసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన 11వ లీగ్ క్రికెట్ పోటీలు

జైపూర్, ఫిబ్రవరి 5 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీపీపీలో చేపట్టిన 11వ లీగ్ క్రికెట్‌పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన ఫైనల్‌లో పీఎంపీఎల్ గేమ్ చేంజర్స్ జట్టుపై థండర్ స్ట్రైకర్ జట్లు విజయం సాధించింది. విజేత జట్టుకు జీఎం శ్రీనివాసులు కప్ అందజేశారు. లీగ్‌మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించిన చీఫ్ కోఆర్డినేటర్, డీజీఎం పంతులను జీఎం అభినందించారు. చీఫ్ ఆఫ్‌వోఅండ్‌ఎం జేన్‌సింగ్, అధికారులు అఖిల్ కపూర్, కేఎస్ ప్రసాద్, సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 5 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న మృతుడి ఆచూకీ గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేందర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్‌కు చెందిన భోగె అఖిల్ (32) ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న అతడికి ఉద్యోగం రాలేదు. దీనికి తోడు కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండడంతో మనస్థాపం చెంది, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లితండ్రులు ఇందిరా, రాజు, సోదరుడు విఖిల్ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీరాంపూర్‌లో షీ టీం అవగాహన సదస్సు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 5 : శ్రీరాంపూర్ కాలనీ సింగరేణి సేవా భవన్‌లో బుధవారం వృత్తి శిక్షణా మహిళలకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా షీ టీం పోలీసులు జ్యోతి, శ్రీలత మహిళల హక్కులు, మహిళల భద్రత, చట్టాలు, అమ్మాయిలపై వేధింపులు, సెల్ ఫోన్ వినియోగంపై అవగామన కల్పించారు. మహిళలపై ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 100 డయల్, 63039 23700 ద్వారా సంప్రదించాలని, సైబర్ క్రైమ్ హైల్ప్ లైన్ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కెరమెరి, ఫిబ్రవరి 5 : మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. మహిళా కాన్సిటేబుల్ లక్ష్మి, హారిక, రేష్మ పలు విషయాలను వివరించారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీఐటీయూ నిరసన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని ఆరోపిస్తూ బుధవారం సీఐటీయూ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్ మాట్లాడుతూ.. బడ్జెట్ బడాబాబుల బొజ్జలు మరింతగా నింపేలా, మధ్యతరగతి ఉద్యోగులను మభ్యపెట్టేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా రూపకల్పన జరిగిందని ఆరోపించారు. ఉపాధి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నాయకులు డీ రాజమణి, అనురాధ, పద్మావతి, ముత్యాలు, అనంతలక్ష్మి, పద్మ, తిరుపతి, రవీందర్, శ్రీకాంత్, నిఖిల్, సాయిపేరన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్‌లో కాఫీ విత్ కస్టమర్స్

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 5 : నస్పూర్ సీతారాంపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో బీఎం నరసింహస్వామి ఆధ్వర్యంలో కాఫీ విత్ కస్టమర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజినల్ మేనేజర్ మురళీమనోహర్ రావు, బిజినెస్ చీఫ్ మేనేజర్ రవికిషోర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ ఆపరేషన్స్ రఘువీర్ శర్మ హాజరయ్యారు. బ్యాంకులో కల్పిస్తున్న సౌకర్యాలపై ఖాతాదారులకు వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్లు హుస్సేన్, రవి, అకౌంటెంట్ చంద్రమౌలి, సిబ్బంది కిరణ్, సాయిప్రకాశ్, మహాలక్ష్మి, నాగలక్ష్మి, ఖాతాదారులు రామన్న, బాపురెడ్డి, రంగారావు, రాజన్న, మల్లారెడ్డి, రాయలింగు, రాజేశం, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ రావు, మల్లేశ్, అన్నయ్య, తిరుపతి, రంజిత్, చిన్నయ్య, బాపన్న, శ్రీధర్‌రావు, రజని, ధరణి, సరోజన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ మురళీమనోహర్ రావు

విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్, జిల్లా సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్ సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన-మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించి, కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆనంద్, అబ్కారీ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ రాథోడ్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

యువత సృజనాత్మకత పెంపొందించుకోవాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 : యువత సృజనాత్మకత పెంపొందించుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు. కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం కళాశాలలో బుధవారం కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ నూతన ఆలోచనలను సమాజానికి ఉపయోగపడేలా, పారిశ్రామికవేత్తలుగా రూపుదిద్దుకునేలా అవకాశం ఏర్పడుతుందన్నారు. యువతను సన్మార్గంలో ప్రోత్సహించేలా వారి ఆలోచనలను వారి భవిష్యత్, ఉపాధికి ఉపయోగపడేలా ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ ఏకాంబరం, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బీ ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు

మేము తెచ్చామంటే మేము తెచ్చామంటూ గొప్పలు

కౌటాల, ఫిబ్రవరి 5 : మండలంలో అభివృద్ధి పనులు 'మేము తెచ్చామంటే మేము తెచ్చాం..' అంటూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వివాదంగా మారింది. ఆయా పార్టీల నాయకులు బుధవారం వేర్వేరు కార్యక్రమాలు చేపట్టి, మాట్లాడడంపై ప్రజల్లో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. కౌటాల-తుమ్మిడిహట్టి వరకు బీటీ రోడ్డు కోసం రూ.8 కోట్లు, మొగడ్‌ధగడ్-తాటినగర్ వరకు బీటీ రోడ్డు రూ.2 కోట్ల నిధులు ఎమ్మెల్సీ దండే విఠల్ కృషి వల్లే సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేసినట్లు ఆ పార్టీ నాయకులు మొగడ్‌ధగడ్ చౌరాస్తాలో సీఎం, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అయితే ఈ అభివృద్ధి పనుల కోసం గత డిసెంబర్‌లోనే ఎమ్మెల్యే హరీశ్ బాబు ప్రపోజల్ పంపారని, ఆయన కృషి వల్లే ఈ రోడ్లు మంజూరైనట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కుంచాల విజయ్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే గతంలో ఇలాంటి ఘటనలు జరుగలేదని, అందరూ ప్రజలకు సేవచేయాల్సింది పోయి, గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 : పట్టణంలోని కన్నాల ఫ్లై ఓవర్ కింద రైలు పట్టాల నడుమ మండలంలోని చంద